
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
జిల్లా వార్తలు
5
సోమవారం 18 నవంబరు 2024



'సర్వేను మరో పదిరోజులు పొడిగించాలి'

కరీంనగర్ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే గడువును మరో పది రోజుల పాటు పొడిగించాలని టీపీటీఎఫ్ ప్రభుత్వాన్ని కోరింది. కరీంనగర్‌లో ఆదివారం నిర్వహించిన టీపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ అత్యవసర సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు మాట్లాడుతూ ఒక్కో కుటుంబానికి సంబంధించిన 75 ప్రశ్నలకు సమాధానాలను పూర్తిచేయడానికి 30 నుంచి 45 నిమిషాల సమయం పడుతుందన్నారు. ఒక్కో ఎన్యూమరేటర్ రోజుకు ఐదు కుటుంబాల సర్వేను మాత్రమే పూర్తి చేయగలుగుతున్నారని తెలిపారు. ఒక్కొక్కరికి 150 నుంచి 180 కుటుంబాల సర్వే బాధ్యతలను అప్పగించారని, వీటన్నింటిని ఈనెల 22లోగా పూర్తి చేయాలని గడువు విధించడంతో తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ఉదయం పాఠశాలకు వెళ్లి మధ్యాహ్నం నుంచి సాయంత్రం ఐదు గంటల తర్వాత కూడా సర్వేకు వెళ్తున్నామని, మహిళా ఉపాధ్యాయులకు ఐదు తర్వాత అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. వీటిని ప్రభుత్వం పరిశీలనలోకి తీసుకుని గడువును మరో పది రోజులైనా పొడిగించాలని కోరారు. సమావేశంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జింకె రాంచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి వేల్పుల బాలయ్య పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయంలో ఉపన్యాస పోటీలు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా జిల్లా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. 'మేకిన్ ఇండియా', 'ప్రపంచ శాంతి-భారతదేశ పాత్ర' అంశాలపై నిర్వహించిన పోటీల్లో పాఠశాల, కళాశాల విద్యార్థులు పాల్గొని ఉపన్యాసాలు ఇచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎ సరిత, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు మహర్దశ

- పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా మార్పు
- కార్పొరేట్ తరహాలో ఏర్పాట్లు
- జిల్లాలో 36 కేంద్రాల ఎంపిక
- చిన్నారులకు మౌలిక వసతుల కల్పన

గణేశ్‌నగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్తరూపు తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటాయి. కార్పొరేట్ కిడ్స్ స్కూల్స్ తరహాల్లో అంగన్ వాడీ కేంద్రాలను మార్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. ప్రస్తుత అంగన్‌వాడీ కేంద్రాలను అత్యాధునిక హంగులతో తీర్చిదిద్దేందుకు ప్రభుత్వాలు సిద్ధమయ్యాయి. గ్రామీణ స్థాయిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటికే పౌష్టికాహార ప్రాధాన్యం, పిల్లలు, గర్భిణులు, బాలింతలకు సేవలందిస్తూ పిల్లలకు ప్రీ స్కూల్ విద్యను అందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లా వికలాంగుల, వయోవృద్ధులు, మహిళా, శిశు సంక్షేమ శాఖ ద్వారా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలన్నింటినీ కార్పొరేట్ కిడ్స్ స్కూల్ స్థాయిలో అత్యాధునిక హంగులు కల్పించడానికి చర్యలు చేపట్టింది.



ఆకట్టుకునే చిత్రాలతో అంగన్‌వాడీ కేంద్రం

ఆధునీకరణ ప్రారంభం

అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునీకరించేందుకు జిల్లాలో మొదటి దశలో 342 కేంద్రాలను ఎంపిక చేశారు. వాటిని ఆధునీకరించి మెరుగైన వసతులు కల్పించడానికి పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. తొలుత సొంత భవనాలు ఉన్న కేంద్రాలను అధునాతనంగా తీర్చిదిద్దుతున్నారు. అద్దె భవనాల్లో నడుస్తున్న వాటికి మాత్రం నూతన భవన నిర్మాణ సమయంలోనే తీర్చిదిద్దాలని నిర్ణయించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 3 నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలు చదువుతున్నారు. వీటిని కార్పొరేట్ కిడ్స్ పాఠశాలల మాదిరిగా తీర్చిదిద్దడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.

జిల్లాలో మొత్తం 777 అంగన్‌వాడీ కేంద్రాలు

జిల్లాలో మొత్తం 777 అంగన్‌వాడీ కేంద్రాలుండగా వాటిలో 44.006 మంది పిల్లలున్నారు.

మిగతా 8వ పేజీలో..

అన్ని హంగులతో..

భవనాలకు రంగులు వేయించడం, తరగతి గదిలో చిన్నారులను ఆకట్టుకునేలా బొమ్మల పెయింటింగ్ మరుగుదొడ్ల నిర్మాణం, సురక్షిత తాగునీటి సౌకర్యం కల్పించేందుకు రెడీ అయ్యారు. కొత్తగా ఫర్నీచర్‌ను సమకూర్చనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను కిడ్స్ పాఠశాలలుగా మార్చడానికి ఒక్కో కేంద్రానికి 30 వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. పనుల నిర్వహణ తీరును కలెక్టర్‌తోపాటు అధికారులు పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో 33 కేంద్రాల్లో ఆధునిక హంగుల పనులు చేపట్టిన అధికారులు త్వరలో పూర్తి చేసి ప్రారంభించేందుకు సమాయత్తమయ్యారు.




అంగన్‌వాడీ క్రేంద్రంలో గోడలపై వేసిన వివిధ రకాల చిత్రాలు, చిన్నారులకు అందించే యూనిఫాం

జంటనగరాల్లో హోమ్ డెలివరీ సర్వీస్‌ను వినియోగించుకోవాలి


కరీంనగర్‌లో పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేస్తున్న కార్గో లాజిస్టిక్స్ బిజినెస్ హెడ్ శ్రీధర్

భగత్‌నగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జంట నగరాల్లో కార్గో లాజిస్టిక్స్ హోమ్ డెలివరీ సర్వీస్‌ను ప్రజలు వినియోగించుకోవాలని కార్గో లాజిస్టిక్స్ బిజినెస్ హెడ్ శ్రీధర్ కోరారు. కరీంనగర్ లాజిస్టిక్స్ కార్గో ఆఫీస్‌ను, ఆర్టీసీ పెట్రోల్ బంక్‌ను ఆయన ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరీంనగర్ రీజియన్ పరిధిలోని, పట్టణ, గ్రామాల ప్రజలు ఆర్టీసీకార్గో లాజిస్టిక్స్ హోమ్ డెలివరీ సర్వీసును వినియోగించుకోవాలన్నారు. హైదరాబాద్‌లో ఉంటున్న పిల్లలు, ఉద్యోగులు ఏవైనా వస్తువులు పంపించాలంటే అతి తొందరగా, భద్రంగా హోమ్ డెలివరీ చేస్తామన్నారు. కరీంనగర్‌తోపాటు, ప్రతి మండలంలో లాజిస్టిక్స్ కార్గో కేంద్రం ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటి రీజినల్ మేనేజర్ భూపతిరెడ్డి, డిపో మేనేజర్ మల్లయ్య పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

కరీంనగర్-2 డిపో పరిధిలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ వి మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్-2 డిపో పరిధిలోని కరీంనగర్, చొప్పదండి, ధర్మారం, గంగాధర మండలాల ప్రయాణికులు సోమవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఫోన్ చేసి సమస్యలు, సలహాలు తెలిపారన్నారు. 9959225921 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి..


సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

గణేశ్‌నగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ డిమాండ్ చేశారు. నగరంలోని బీసీ సంక్షేమ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యారంగ సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఈ నెల 25న సీఎం పర్యటన సందర్భంగా విద్యార్థులతో కలిసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు, నిరసన కార్యక్రమంతో సీఎం రేవంత్‌రెడ్డిని అడ్డుకుంటామన్నారు. రాష్ట్రంలో విద్యార్థులు అనేకమైన సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యల పైన స్పందించాలని, లేకుంటే బీసీ సంక్షేమ సంఘం, అనుబంధ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవ్, పోకల విజయ్, కొట్టె శివ పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో గురుకులాలు

అరకొర వసతులతో ఇబ్బందుల్లో విద్యార్థులు

గంగాధర, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి నియోజవర్గానికి చెందిన మూడు గురుకుల పాఠశాలలు గంగాధరలో కొనసాగుతున్నాయి. గంగాధర మండల కేంద్రంలో జ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాల, మధురానగర్‌లో మైనారిటీ గురుకుల బాలిక పాఠశాల, వేములవాడ రోడ్‌లో జ్యోతి బాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలున్నాయి. ఈ మూడు గురుకులాలను అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాల్లో వివిధ ప్రాంతా లకు చెందిన విద్యార్థులు చదువుకుంటున్నారు. నాలుగేళ్లుగా పాఠశాలల్లో చదవుతున్న విద్యార్థులు పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. క్రీడల్లోనూ ప్రతిభను చాటుతున్నారు. చదువులు, క్రీడల్లో ముందుంటున్నా అరకొర వసతులతో ఇబ్బందులు పడుతున్నారు.


బీసీ బాలుర గురుకుల పాఠశాల


బీసీ బాలికల గురుకుల పాఠశాల

సమస్యలెన్నో..

మధురానగర్‌లోని 464 మంది విద్యార్థులున్న జ్యోతి బాపూలే బీసీ బాలికల పాఠశాల చుట్టూ వ్యవసాయ భూములున్నాయి. పాఠశాల అసంపూర్తిగా ఉండడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. విద్యార్థులకు సరిపడా స్నానపు గదులు లేక రాత్రి మూడుగంటలకే లేచి స్నానాలు చేయవలసిన వస్తోందని విద్యార్థినులు వాపోతున్నారు. ఇటీవల బాత్ రూంలో విద్యుదాఘాతంతో ఓ విద్యార్థిని గాయపడింది. ప్రహరీ లేక తరుచు విషపురుగులు వస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. 362 మంది విద్యార్థులున్న మైనారిటీ గురుకుల బాలికల పాఠశాలలో మైదానం సరిపోవడంలేదు.

చిన్నపాటి వర్షం పడితే మైదానంలో నీరు చేరి చిన్న చెరువును తలపిస్తుంది. 445 విద్యార్థులున్న జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో మూడేళ్లుగా ప్రభుత్వం నుంచి రావాల్సిన బెడ్స్ అందక విద్యార్థులు కిందే పడుకుంటున్నారు. విద్యార్థులకు కనీసం డెస్క్‌లు లేవు. ఆటలాడేందుకు మైదానం సరిపోవడంలేదు. ఇటీవల విద్యుత్ వైర్లు తెగి పడడంతో ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు.

ఈ సంఘటన జరిగి నెలలు గడుస్తున్నా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను పాఠశాల సమీపం నుంచి తొలగించలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గురుకులాలకు సొంత భవనాలు నిర్మించి, సౌకర్యాలు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి అగ్ని ప్రమాదం
రూ. 12 లక్షల ఆస్తి నష్టం 6

ఆదమరిస్తే అంతే
రోడ్డు పక్కన ప్రమాదకరంగా బావులు
రక్షణ గోడలు లేక ప్రమాదాలు 8

గ్రామీణ రోడ్లకు మోక్షమెప్పుడో..?
ఏడాది క్రితం నిధులు మంజూరు
పనులు చేసేందుకు ముందుకు రాని కాంట్రాక్టర్లు 8

ప్రశాంతంగా గ్రూప్-3 పరీక్షలు

ఆలస్యంగా వచ్చి నిరాశతో వెనుదిరిగిన పలువురు అభ్యర్థులు


పరీక్ష రాసేందుకు బారులు తీరిన అభ్యర్థులు



సమయం మించిపోవడంతో విచారంతో వెనుదిరిగిన అభ్యర్థులు

కరీంనగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఆదివారం ఉదయం, సాయంత్రం, సోమవారం ఉదయం జరిగే ఈ పరీక్షలకు గంటన్నర ముందు నుంచే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, అరగంట ముందే ప్రధాన ద్వారం మూసివేస్తామని అధికారులు ప్రకటించారు. దాదాపు అన్ని కేంద్రాల్లో ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను లోనికి అనుమతించక పోవడంతో పలువురు నిరాశతో వెనుదిరిగారు. జిల్లాలో 26,415 మంది పరీక్షలు రాసేందుకు వీలుగా కరీంనగర్, కరీంనగర్ అర్బన్, తిమ్మాపూర్, కొత్తపల్లి మండలాల్లో 56 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి 144 సెక్షన్‌ను అమలు చేశారు. ఉదయం 8.30 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామని ప్రకటించడంతో చాలా మంది 8 గంటల వరకే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. 9.30 వరకు అభ్యర్థులను లోనికి అనుమతించారు. ఆ తర్వాత పరీక్షా కేంద్రాల ప్రధాన ద్వారాన్ని మూసివేయగా చాలా మంది అభ్యర్థులు కేంద్రాలకు వచ్చి పరీక్ష రాసేందుకు అనుమతించాలంటూ పోలీసులను, అధికారులను ప్రాధేయ పడ్డారు. అధికారులు అనుమతించకపోవడంతో వెను దిరిగారు. ఉదయం నిర్వహించిన పరీక్షకు 26,415 మందికి 12,311 మంది గైర్హాజరు కాగా 14,104 మంది అభ్యర్థులు మాత్రమే పరీక్ష రాశారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 12,406 మంది గైర్హాజరు కాగా 14,009 మంది పరీక్షలు రాసినట్లు జిల్లా అధికారులు తెలిపారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ పలు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. జడ్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ నుంచి పోలీసు బందోబస్తు మధ్య అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, ఏసీపీ విజయ్ కుమార్, పరీక్షల రీజినల్ కో ఆర్డినేటర్లు వరలక్ష్మి, సతీష్ సమక్షంలో పరీక్షా పత్రాలను, ఇతర సామగ్రిని పరీక్షా కేంద్రాలకు తరలించారు. కార్యక్రమంలో సీఐలు కోటేశ్వర్, విజయ్‌కుమార్, జాన్‌రెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ కాళీచరణ్ పాల్గొన్నారు.







సమయం దగ్గర పడడంతో పరుగులు పెడుతున్న అభ్యర్థులు, అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది, ఆలస్యంగా రావడంతో సిబ్బందిని బతిమాలుతున్న అభ్యర్థులు, పరీక్ష రాసేందుకు వస్తున్న దివ్యాంగురాలు

'విద్యార్థుల సమస్యలు పట్టని ముఖ్యమంత్రి'

భగత్‌నగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యార్థుల సమస్యలు పట్టించుకోవడం లేదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి ఓ ప్రకటనలో విమర్శించారు. ప్రభుత్వాలు మారినా విద్యార్థుల బాధలు తీరడం లేదన్నారు. విద్యాశాఖను తన వద్దే ఉంచుకుని ఇంతవరకు సమీక్ష కూడా చేయలేని పరిస్థితిలోఉన్నారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ బకాయిలు విడుదలచేయక పోతే విద్యార్థి లేకం ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తుందన్నారు. విశ్వవిద్యాలయాలకు సరిపడా నిధులు కేటాయించకుండా టీచింగ్,నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. విద్యారంగంపై సమీక్ష చేసి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలన్నారు.

క్రైం కార్నర్

సెల్‌ఫోన్ కోసం గొడవ పడి బాలిక ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ విషయంలో తన తమ్ముడితో గొడవ పడిన బాలిక(17) చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్‌లోని గోదాంగడ్డకు చెందిన ఒక బాలిక శనివారం సాయంత్రం తన తమ్ముడితో సెల్‌ఫోన్ ఇవ్వాలని గొడవ పడింది. తమ్ముడు సెల్‌ఫోన్ ఇవ్వకపోవడంతో క్షణికావేశంలో ఇంట్లో ఉన్న ఇనుపపైపుకు తన చున్నీతో ఉరివేసుకుంది. కొన ఊపిరితో ఉన్న బాలికను తల్లిదండ్రులు గుర్తించి వెంటనే ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. బాలిక కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని రైతు మృతి


పర్శరాములు(ఫైల్)

తంగళ్లపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కేజీవీల్ ఢీకొని రైతు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. తంగళ్లపల్లి మండలం చిన్న లింగాపూర్ గ్రామానికి చెందిన ముచ్చర్ల పర్శరాములు (30) అద్దెకు తీసుకున్న కేజీవీల్ ట్రాక్టర్‌తో వ్యవసాయ పనులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో డ్రైవర్ ట్రాక్టర్‌ను నిర్లక్ష్యంగా నడిపి పర్శరాములు ఢీ కొట్టాడు. వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన పర్శరాములుపైకి కేజీవీల్ ట్రాక్టర్ వెళ్లడంతో పర్శరాములు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే జిల్లా కేంద్రం లోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచ న మేరకు మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. పర్శరాములుకు భార్య కవిత, కుమారుడు రిషిత్(2) ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టి రూ.35 లక్షల నష్టం

- అప్పులు తీర్చే మార్గం లేక యువకుడి ఆత్మహత్య

- రాజన్న సిరిసిల్ల జిల్లా సింగారంలో విషాదం


స్వామిగౌడ్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టి భారీగా నష్టపోయాడు ఓ యువకుడు. అప్పులు తీర్చే మార్గం కనిపించకపోవడంతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామానికి చెందిన బండి స్వామిగౌడ్(35) తన తండ్రి లక్ష్మీనారాయణతో కలిసి మండల కేంద్రంలో పాల కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. అతడు కొన్ని రోజులుగా స్టాక్ మార్కెట్‌లో తన వద్ద ఉన్న డబ్బులు, స్వగ్రామంలోని తన ఇంటిని తాకట్టు పెట్టి మొత్తం రూ. 35 లక్షలు స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టాడు. ఆ మొత్తం నష్టపోయాడు. దీంతో మనస్తాపం చెంది స్వామి గౌడ్ ఈ నెల 9న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వారం రోజులుగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. స్వామి గౌడ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు, తల్లిదండ్రులు ఉన్నారు. తల్లి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

ద్విచక్రవాహనం ఢీకొట్టిన ఘటనలో ఇద్దరి మృతి

మంగళ్‌హాట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడి నిర్లక్ష్యం అతడి ప్రాణంతో పాటు మరో వ్యక్తి ప్రాణాలను బలితీసుకుంది. ద్విచక్ర వాహనం ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరు మృతిచెందిన సంఘటన సుల్తాన్ బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఎంజీబీఎస్ కాళీకబర్ ప్రాంతంలో నివాసం ఉండే రాందాస్ నైక్వాడే(32) ర్యాపిడోలో ద్విచక్రవాహనం నడుపుకుంటున్నాడు. ఈనెల 15వ తేదీ అర్ధరాత్రి తన ద్విచక్రవాహనం(ఏపీ 11ఏఎం 8139)పై రాత్రి 11.30 గంటల సమయంలో కాచిగూడ ఎక్స్ రోడ్ నుంచి కుద్బీగూడ రోడ్డు గుండా వచ్చి హెచ్‌పీ పెట్రోల్ పంప్ వద్ద తిరిగి కాచిగూడ వైపునకు యూటర్న్ తీసుకుంటుండగా అదే సమయంలో రాజన్న సిరిసిల్లా జిల్లాకు చెందిన చంద్రశేఖర్(20) తన ద్విచక్రవాహనంపై అతి వేగంగా కాచిగూడ రైల్వే స్టేషన్ రోడ్డు గుండా వచ్చి ఢీ కొట్టాడు. ఈ ఘటనలో ఇద్దరూ అపస్మారక స్థితిలో పడిపోవడంతో వెంటనే రాందాస్‌ను సీసీ ష్రాఫ్ ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యలో మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. చంద్రశేఖర్‌ను ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. అతివేగం కారణంగా ఇద్దరి ప్రాణాలు పోవడంతో ఇరు కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

గ్యాస్ సిలిండర్ పేలి అగ్నిప్రమాదం

- రూ.12 లక్షల ఆస్తి నష్టం


మంటలను ఆర్పుతున్న సిబ్బంది


ఇంట్లో అంటుకున్న మంటలు

కరీంనగర్ అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం సీతారాంపూర్ పరిధిలోని సాయినగర్ ప్రాంతంలో ఒక ఇంటిలో ఆదివారం రాత్రి గ్యాస్ సిలిండర్ పేలి మంటలు అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో ఇంటిలోని సామగ్రి, ఇతర గృహోపకరణ వస్తువులు కాలిబూడిదయ్యాయి. ఇంటి యజమాని అయిన ఏఎస్ఐ (డీసీఆర్‌బీ) రామస్వామికి గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. ఇంటిలోని ఏసీలు, ఫ్రిడ్జ్, బీరువా తదితర సామగ్రి దగ్ధమయ్యాయి. ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో వంట చేసే క్రమంలో గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు అంటుకుని ఇల్లు మొత్తం వ్యాపించాయి. మం టలు అంటుకున్న సిలిండర్‌ను ఇంటి బయటకు తీసుకువస్తున్న క్రమం లో యజమాని రామస్వామికి అంటుకుని గాయపడ్డాడు. రామస్వామి భార్య లతకు కూడా స్వల్ప గాయాలయ్యాయి. కరీంనగర్ అగ్నిమాపకశాఖ అధికారులు వెంటనే ఫైరింజన్‌తో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ అగ్నిప్రమాదంలో సుమారు 12 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని కరీంనగర్ ఫైర్ సిబ్బంది తెలిపారు. మంటలను అదుపు చేయటంలో కరీంనగర్ లీడింగ్ ఫైర్ మెన్ మహేందర్, టి లక్ష్మారెడ్డి, బి మారుతి, ఎం రఘు, హోంగార్డు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

వెల్గటూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలంలోని ముత్తునూర్ గ్రామంలో శనివారం రాత్రి జరిగినరోడ్డు ప్రమాదంలో అంబారిపేటకు చెందిన ఆరె ల్లి విఘ్నేష్ (20) అనే యువకుడు మృతి చెందగా ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మృతుడు విఘ్నేష్ అదే గ్రామానికి చెందిన లింగంపల్లి లక్ష్మణ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై అంబారిపేట నుండి ము త్తునూర్ వచ్చారు. ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో ముత్తునూరు గ్రామ శివారులోని మూలమలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న ఎ త్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన కుండీ గోడకు ఢీకొట్టింది. ఈ సంఘటనలో వాహనం నడుపుతున్న వి ఘ్నేష్ తీవ్ర గాయాలై అక్కడిక క్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న లక్ష్మణ్‌కు స్వల్ప గాయాలు కావడంతో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడిపై కత్తితో దాడి


గాయపడ్డ బాలుడు

పెద్దపల్లిటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో బాలుడిపై కత్తితో దాడి చేసిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పట్టణంలోని బండారికుంటకు చెందిన చాంద్‌పాషా అనే వ్యక్తి ఆటోలో కూర్చున్న గౌస్‌బాబా(11) అనే బాలుడిపై పక్కనే ఉన్న చికెన్ సెంటర్‌లో కత్తి తీసుకువచ్చి దాడి చేసి గాయపర్చాడు బాలుడికి మెడ భాగంలో తీవ్ర గాయం కాగా స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం వైద్యులు బాలుడిని ఇంటికి పంపించారు. బాలుడి తండ్రి అనీఫ్ మామిడి తోటలు లీజుకు తీసుకుని జీవనం సాగిస్తున్నాడు. అనీఫ్ ఫిర్యాదు మేరకు పోలీసులు గాలింపు చేపట్టి నిందితుడిని బండారికుంటలో పట్టు కున్నారు. కేసు నమోదు చేసుకొని చాంద్ పాషాను కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. కాగా, చాంద్‌పాషా, అలీఫ్ మిత్రులు. ఇద్దరి మధ్య వివాదాల కారణంగా దాడి జరిగినట్లు తెలుస్తోంది.

చికిత్స పొందుతూ మెకానిక్ మృతి

జ్యోతినగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ కృష్ణానగర్‌కు చెందిన కాసు సతీష్ (40) అలియాస్ ఢిల్లీ సతీష్ అనే బైక్ మెకానిక్ కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. తాగుడుకు బానిసైన సతీష్ ఈనెల 15న రాత్రి తన ఇంటి మెట్లు ఎక్కుతుండగా అదుపుతప్పి కింద పడిపోయాడు. తల వెనుక భాగంలో బలమైన గాయమైంది. చుట్టుపక్కల వారు సతీష్‌ను గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో కరీంనగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ సతీష్ మృతిచెందినట్లు ఎన్టీపీసీ ఏఎస్ఐ టి.తిరుపతి తెలిపారు. సతీష్‌కు మతిస్థిమితంలేని భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

చిత్రకళలో నైపుణ్యం

క్షణాల్లోనే అందమైన చిత్రాలను అలవోలకగా వేయడం ఆయన ప్రత్యేకత. ఆ ప్రత్యేకత తనే అలవాటుగా మార్చుకున్నాడు. అదే ఇప్పుడు ఆయనకు గుర్తింపు తెచ్చింది. సినిమాకు కావాల్సిన బొమ్మలు వేస్తూ అందరినీ ఫిదా చేస్తున్నాడు. కథలాపూర్ మండలంలోని భూషణరావుపేటకు చెందిన చిలువేరి కిషోర్. చిన్ననాటి నుంచే బొమ్మలు వేయడం అలవాటు చేసుకోవడంతో పెద్దయ్యాక అదే అలవాటు ఆయనను సినిమా రంగంలో పని చేసేలా తోడ్పడింది. ఐదు భాషలు రావడం వలన సినీ డైరెక్టర్లతో పరిచయం ఏర్పడి పలు సినిమాల్లో అవకాశాలు దక్కేలా చేసింది. కొన్ని సినిమాలకు కిషోర్ వేసిన చిత్రాలు ఆయనకు పలు అవార్డులు సైతం తెచ్చిపెట్టాయి.





కిశోర్ గీసిన చిత్రాలు

- మూడు భాషల సినిమాలకు స్టోరీ బోర్డుల రూపకల్పన
- డాక్యుమెంటరీలతో పల్లెల్లో చైతన్యం
- ప్రముఖ దర్శకుల సినిమాలకు బొమ్మలు
- అద్భుత ప్రతిభకు అవార్డులు

కథలాపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కుంచె పట్టిందే తడవుగా క్షణాల్లో ప్రతిరూపాలను ప్రతిబింబింపజేస్తూ అద్భుత ప్రతిభను కనబరిచి అబ్బురపరుస్తున్నాడు కథలాపూర్ మండలంలోని భూషణరావుపేటకు చెందిన చిలువేరి కిషోర్. చిన్ననాడే చిన్న బొమ్మలను వేయడం అలవాటు చేసుకున్న కిషోర్ తన కంటూ ప్రత్యేకత చాటుకోవాలనే తపనతో ఎంతో సాధన చేశాడు. నిరుపేద కుటుంబంలో పుట్టి నప్పటికీ హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయు)లో 1997లో ఫైన్ ఆర్ట్‌లో డిగ్రీ పట్టా పుచ్చుకున్నాడు. క్షణాల్లోనే అందమైన చిత్రాలను అలవోలకగా వేయడం అలవాటు చేసుకున్నాడు.

డాక్యుమెంటరీల నుంచి భారీ చిత్రాల దాకా..

సినిమాలకు కథా వస్తువు ఎంత అవసరమో డైరెక్టర్ ఇచ్చే సన్నివేశాలకు సంబంధించిన బొమ్మలు అంతే అవసరం. ఆ స్టోరీ బోర్డులే సినిమాకు అందమైన కళను తెచ్చిపెడతాయి. కిషోర్ మొదట కామిక్ చిత్రాలకు బొమ్మలు వేయడంతో తన ప్రస్థానాన్ని ఆరంభించారు. చదువు పూర్తికాగానే చెన్నైలోని రాజ్ కమల్ ఫిల్మ్ కంపనీలో మూడేళ్ల ఉద్యో గం చేశా డు. కమల్‌హాసన్, ప్రియదర్శన్, అశోక్ మెహతా, సంతోష్ శివన్, సింగీతం శ్రీనివాసరావు వంటి ప్రముఖ దర్శకులు రూపొందించిన సినిమా లకు అద్భుతమైన చిత్రాలు వేసి ఔరా అనిపించాడు. ముంబాయిలో పేరొందిన కాస్ట్యూమ్ డిజైనర్ మనీ ష్ మల్హోత్రా వద్ద పనిచేసి చైనాగేట్, పుకార్, పానిక్, డెత్‌రోల్, క్రొకొడైల్ 2 వంటి ఇంగ్లీష్ సినిమాలకు చిత్రాలు వేసి మెప్పు పొందాడు. తెలుగు ఇండస్ట్రీస్‌లో అంజి, ఒక్కడు, శ్రీఆంజనేయం, ఐతే, ఈశ్వర్ వంటి చిత్రాల డైరెక్టర్లకు సన్నివేశాల చిత్రాలను వేశాడు. ప్రస్తుతం యాంకర్ ప్రదీప్ నేతృత్వంలో నితిన్- భరత్ డైరెక్టర్లతో రూపొందిన అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి..సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది.

షార్ట్ ఫిలింలకు అవార్డులు

బాలల హక్కులు, చదువు నేపథ్యంలో కిషోర్ బాల భారతి పేరిట రూపొందించిన షార్ట్ ఫిలింకు యూనిసెఫ్ అవార్డు రాగా అప్పటి దివంగత ముఖ్య మంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా అవా ర్డు అందుకున్నారు. ఈ ఫిలింను దూరదర్శన్‌లో ప్రసారం చేశారు. వృద్ధ దంపతుల పట్ల పుట్టిన వారు చూపే నిర్లిప్తత నేపథ్యంలో సాగే ఎవరికెవరు డాక్యుమెంటరీ ఆలోచింపజేసింది. స్టెతస్కోప్ ... ఓ చిన్ని గుండె చప్పుడు.. షార్ట్ ఫిలిం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రదర్శించారు. 2007లో అప్పటి కలెక్టర్ ప్రశంసా పత్రం అందించి సన్మానించారు. తన చిత్రకళా ప్రదర్శనను గుర్తించిన శివకార్తికేయ ఫిలిమ్స్ సంస్థ కొత్త సినిమాకు అవకాశం కల్పించింది.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే...

చిలువేరి కిషోర్, చిత్రకారుడు



బాల్యంలో బొమ్మలు వేయడాన్ని చూసిన తల్లి దండ్రులు ఆ కళ పట్ల ఉన్న మక్కువతో ప్రోత్సహిం చారు. పట్టుదలతో హైదరాబాద్ లో ఫైన్ ఆర్ట్స్‌లో డిగ్రీ చేశాను. హిందీ, మరాఠీ, ఇం గ్లీష్, మలయాళం, తమిళం వంటి భాషలు రావడం వల్ల సినీ డైరెక్టర్లతో పరిచయాలు ఏర్పడి సినీ రంగం వైపు వెళ్లాను. నిర్మాతలు ఇచ్చే పారితోషికంతో కుటుం బాన్ని పోషిస్తున్నాను. డైరెక్టర్లు సన్నివేశాన్ని చెప్పగానే వెంటనే బొమ్మ వేసి కెమెరామెన్‌కు అందజేస్తాం. అదే కోణంలో కెమెరామెన్ ఆ సన్నివేశాన్ని చిత్రీకరిస్తాడు.

మాలల సింహగర్జనను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మాజీ మంత్రి సుద్దాల దేవయ్య

జగిత్యాలరూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ లోని పరేడ్ గ్రౌండ్ లో జరిగే మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని మాజీ మంత్రి సుద్దాల దేవయ్య పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని శివసాయి రెసిడెన్సీలో ఆదివారం జగిత్యాల జిల్లా మాల సంఘ ముఖ్య నాయకుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం మాలల సింహగర్జన గోడ పత్రికను ఆవిష్కరిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మాలలు పెద్దఎత్తున మాలల సింహగర్జనకు హాజరై మాలల ఐక్యత చాటాలని కోరారు. ఈకార్యక్రమంలో జాతీయనాయకుడు పసుల రాంమూర్తి, జేఏసీ నాయకుడు నకుమల్ల లక్ష్మీనారాయణ, మాలసంఘ నాయకులు బొల్లం విజయ్, బండశంకర్, మద్దెల నారాయణ, కారంగుల వసంతరావు, ముద్దం ప్రభాకర్, చిత్తారి ప్రభాకర్, మ్యాదరి శ్రీహరి, పులిగోవర్ధన్, కంటె అంజయ్య, కొప్పుల వెంకటరమణ, కాయితీ శ్రీనివాస్, కడమండకమలాకర్, న్నర రాజేందర్, సతీష్, హర్ష, మల్లేస్, రాజేందర్, అశోక్, నరేష్, సుమన్, పాల్గొన్నారు.

టాస్క్ పోరాట ఫలితమే వృద్ధుల సంరక్షణ పాలసీ


సమావేశంలో మాట్లాడుతున్న హరి అశోక్ కుమార్

జగిత్యాల అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ పోరాటం ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం వృద్ధుల సంరక్షణ పాలసీని ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిందని టాస్క్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయంలో కేంద్రం వృద్ధుల సంరక్షణ పాలసీ, సంక్షేమ చట్టానికి సవరణలు అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు వృద్ధుల సంరక్షణ సంక్షేమ చట్టానికి సవరణలు చేయాలని, ప్రధాన మంత్రి లక్షలాది పోస్టు కార్డు పంపి చేసిన ఉద్యమ కార్యాచరణ ఫలితంగా ఈ నెల 16న కేంద్ర సామాజిక, న్యాయ కార్యదర్శి వృద్ధ సంరక్షణ పాలసీని రూపొందించడానికి కేంద్రం నిర్ణయం తీసుకుందన తెలిపారు. కార్యక్రమంలో గౌరిశెట్టి విశ్వనాథం, హన్మంత్ రెడ్డి, వెలుముల ప్రకాష్ రావు, విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

మల్యాల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నూకపల్లికి చెందిన సైదల నరేందర్ అలియాస్ నరేశ్(25) అనే యువకుడు కొన్నాళ్లుగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తండ్రి హన్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి


రాజన్న ఆలయంలో పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

వేములవాడ కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయానికి ఈ నెల 20వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి రానున్న నేపథ్యంలో ఎస్పీ అఖిల్ మహాజన్ ఆలయ పరిసరాలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి దర్శనం చేసుకునేందుక వీలుగా ఉండేందుకు క్యూలైన్‌లను పరిశీలిం చారు. పార్కింగ్ స్థలాన్ని పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. వారి వెంట ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, సీఐ వీరప్రసాద్, రాజన్న ఆలయ ఈఈ రాజేష్ ఉన్నారు.

వేములవాడలో పోలీసుల తనిఖీలు


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

వేములవాడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో ఆదివారం వేములవాడ పట్టణంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ వీరప్రసాద్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఈనెల 20వ తేదీన వేములవాడలో పర్యటించనున్న నేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తనిఖీలను విస్తృతం చేశామని, ప్రజలు సహకరించాలని కోరారు.

చందుర్తి: మండలంలోని మూడపల్లిలో కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి ఏఎస్సై బాపు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాల యజమానులకు జరిమానా విధించారు. వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఏఎస్సై బాబు సూచించారు.

రోడ్డున్నా బస్సులు కరువు

- మహాలక్ష్మి పథకానికి నోచుకోని మహిళలు - రాకపోకలకు గ్రామస్థుల ఇబ్బందులు

- పట్టించుకోని సంబంధిత అధికారులు - చర్యలు తీసుకోవాలని వినతి


అబ్బాపూర్ తారురోడ్డు

గొల్లపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా మారింది గొల్లపల్లి మండలంలోని పలు గ్రామాల తారు రోడ్ల పరిస్థితి. గతంలో కోట్ల ప్రజాధనం వెచ్చించి వేయించిన తారు రోడ్ల పై ఆర్టీసీ బస్సులు నడవక అలంకార ప్రాయంగా మారాయి. రాష్ట్రం అంతా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం తమకు ఎందుకు వర్తించదు అంటూ ఆయా గ్రామాల మహిళలు వాపో తున్నారు. ఇప్పటివరకు మండలంలోని వెంగళాపూర్, మల్లన్నపేట, శంకర్రావు పేట, నందిపల్లె, అబ్బాపూర్, తదితర గ్రామాల ప్రజలు ఇప్పటివరకు పల్లె బస్సులను ఎరగకుండా ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాల నుంచి నిత్యం ప్రజలు, రైతులు, విద్యార్థులు ఇతర ప్రాంతాలకు రాకపోకలు కొనసా గిస్తున్నారు. ఆర్టీసీ బస్సులను నడపకపోవడంతో ఆర్టీసీ ఆదాయానికి గండి పడుతోంది. దీతో ఆయా గ్రామాల ప్రజలు సంబంధిత అధికారుల నిర్లక్ష్యవైఖరి పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నప్పటికి పట్టించుకున్న నాథులు కరువయ్యారని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

- అలంకార ప్రాయంగా తారు రోడ్లు ..

ఆయా గ్రామాలకు కోట్లాది ప్రజా ధనాన్ని వెచ్చించి ప్రభుత్వాలు గతంలో విశాలమైన తారు రోడ్లను వేసినప్పటికి ఆయా గ్రామాలకు ఆర్టీసీ బస్సులను అధికారులు నడపకపోవడంతో రోడ్లన్నీ అలంకార ప్రాయంగా మారాయి. ప్రజా రవాణా సౌకర్యానికి తా రు రోడ్లు ఉపయోగపడుతున్నప్పటికి ప్రజలను రవాణా చేయడానికి ఆర్టీసీ బస్సులను నడపకపోవడం సమంజసం కాదని ప్రజలు వాపోతున్నారు.

- ఆటోవాలాల అధిక వసూళ్లు..

ఆయా గ్రామాలకు ఆర్టీసీ బస్సుల సౌకర్యం లేకపోవడంతో దిగువ, పేద, మధ్య తరగతి మహిళలు ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు ఆటోలను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. దీనిని అదనుగా తీసుకుని ఆటోవాలాలు ప్రజల నుంచి అధికంగా వసూలు చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. రాత్రి సమయాల్లో అయితే, మరింత అధికంగా వసూలు చేస్తూ సోమ్ము చేసుకుంటూ తమ జేబులను గుల్ల చేస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు బస్సులు వేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డిపోలో బస్సుల కొరత

జగిత్యాల ఆర్టీసీ డీపోలో బస్సుల కొరత మూలంగానే కొన్ని గ్రామాలకు బస్సులను నడపటం లేదు. రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ ప్రజా రవాణాకి అవకాశం ఉన్నప్పటికీ బస్సుల కొరత వెంటాడుతోంది. ఉన్న బస్సులు పాత రూట్లకే సరిపోతున్నాయి. కొత్త రూట్లకు నడపాలంటే అదనపు బస్సులు అవసరం. దీనిపై ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రభుత్వం కొత్త బస్సులను మంజూరు చేయగానే బస్సుల సౌకర్యం కల్పిస్తాం.

- సునీత, జగిత్యాల డీపో డీఎం

ఆర్టీసీ బస్సులను నడపాలి..



తమ గ్రామానికి ఇప్పటివరకు ఆర్టీసీ అధికారులు ఆర్టీసీ బస్సును నడపలేదు. ప్రధాన రహదారి నుంచి సుమారు 3 కిలో మీటర్ల మేర కాలి నడకన లేదా, ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఉదయం పూట ఇతర గ్రామాలకు వెళ్లి, పాలు, కాయగూరలు విక్రయించుకోవటానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. రోడ్లు వేశారే తప్ప బస్సులను నడపడం అధికారులు మరిచిపోయారు. గ్రామాలకు బస్సులను నడపాలి.

-రాజు రాజయ్య, అబ్బాపూర్

ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ రాష్ట్ర పోటీల్లో
ఓవరాల్ చాంపియన్‌గా కరీంనగర్


అథ్లెటిక్స్ రాష్ట్ర ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14 అథ్లెటిక్స్ ఓవరాల్ చాంపియన్‌గా ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు నిలిచింది. ఈ నెల 15, 16, 17 తేదీల్లో ఖమ్మంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన బాల బాలికల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు పలు అంశాల్లో బంగారు, రజత పతకాలను సాధించి రాష్ట్రస్థాయిలో ఓవరాల్ చాంపియన్లుగా నిలిచారు. ఈ పోటీల్లో 100 మీటర్ల పరుగులో జి నక్షత్ర బంగారు పతకం, 200 మీటర్ల పరుగులో సమీరా బంగారు, 400 మీటర్ల పరుగులో జాహ్నవి బంగారు, 80 మీటర్ల హర్డిల్స్‌లో జి సాయి చైతన్య బంగారు, బాలికల 80 మీటర్ల హర్డిల్స్‌లో జి నక్షత్ర బంగారు, ఆస్మిన్ బేగం రజత పతకాలను సాధించారు. కాగా 400 మీటర్ల రిలేలో ఉమ్మడి జిల్లా బాలికల జట్టు బంగారు పతకాన్ని సాధించింది. బాలుర జట్టు కాంస్య పతకాన్ని సాధించింది. అలాగే 600 మీటర్ల పరుగులో సమీరా రజత పతకం, 200 మీటర్ల పరుగులో జాహ్నవి రజత పతకాలు సాధించి ఓవరాల్ చాంపియన్లుగా నిలిచారు. ఈ జట్టుకు కోచ్‌గా పూదరి రమేష్, మేనేజర్‌గా రవీందర్ వ్యవహరించారు. రాష్ట్ర చాంపియన్లుగా నిలిచిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులను కరీంనగర్ డీఈవో సీహెచ్‌వి జనార్దన్‌రావు, కరీంనగర్ జిల్లా ఎస్‌జీఎఫ్ ప్రధాన కార్యదర్శి బి వేణు గోపాల్, డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, క్రీడా పాఠశాల కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు. కాగా జాతీయస్థాయి పోటీలకు బాలుల విభాగంలో ఎం. సాయిచైతన్య (కరీంనగర్) బాలికల విభాగంలో జి నక్షత్ర (కరీంనగర్) ఎండీ సమీరా (కరీంనగర్), ఎండీ ఆస్మిన్(కరీంనగర్) ఎన్నికయ్యారు.

హైదరాబాద్ క్రికెట్ జట్టుకు శ్రీవల్లి ఎంపిక


కట్ట శ్రీవల్లి

కరీంనగర్ స్పోర్ట్స్/ ఇల్లంతకుంట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన కట్ట శ్రీవల్లి హైదరాబాద్ క్రికెట్ జట్టుకు (హెచ్‌సీఏ) ఎంపికైంది. ఉమ్మడి జిల్లా నుంచి క్రికెట్ పోటీలకు ఎంపికైన మొదటి మహిళా క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శ్రీపురంకాలనీకి చెందిన కట్ట ఉమారాణి లక్ష్మారెడ్డిల చిన్న కూతురు కట్ట శ్రీవల్లి గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో డిసెంబర్ 4న జరగనున్న వన్డే క్రికెట్ పోటీల్లో శ్రీవల్లి ఆడనుంది. ఇటీవల రాష్ట్రంలో జరిగిన పలు హెచ్‌సీఏ క్రికెట్ పోటీల్లో తన ఫాస్ట్ బౌలింగ్‌తో అత్యధిక వికెట్లు తీసి మొదటి స్థానంలో నిలిచింది. దీంతో మహిళల సీనియర్ సెలక్షన్ కమిటీ ఆమెను జాతీయ పోటీలకు ఎంపిక చేసింది. ఆదివారం హైదరాబాద్‌లోని ఉప్పల్ ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిసెంబర్ 4న జరగనున్న బీసీసీఐ సీనియర్ మహిళల వన్డే ట్రోఫీలో ఆడనున్న హెచ్‌సీఏ హైదరాబాద్ జట్టుకు ఫాస్ట్ బౌలర్‌గా శ్రీవల్లిని ఎంపిక చేశారు. ఈసందర్భంగా శ్రీవల్లిని ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి ఆగంరావు, ఎన్ మురళీధర్‌రావు, ఉపాధ్యక్షులు పి మనోహర్‌రావు, కె మహేందర్‌గౌడ్, కోశాధికారి శ్రవణ్ కుమార్, కోచ్‌లు డి శ్రీనివాస్, శ్రావణ్, కిరణ్, వరుణ్ అభినందించారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

కోరుట్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో జరిగిన అండర్ 19 తైక్వాండ్ కరాటే పోటీలలో కోరుట్ల విద్యార్థులు రాణించి బంగారు, క్యాంస పతకా లను సాధించారు. పట్టణంలోని మాస్ట్రో కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బోడ నందిని విద్యార్థి రాష్ట్ర స్థాయి పోటీలలో రాణించి గోల్డ్ మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కరస్పాడెంట్ రాజేష్‌లు తెలిపారు. అదే విధంగా పీఆర్‌బీఎం కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థి మారంపల్లి రోహిత్ రాణించి క్యాంస పతకం సాధించినట్లు కళశాల కరస్పాండెంట్ పోతని ప్రవీణ్ కుమార్ తెలిపారు. విద్యార్థులను కళాశాల నిర్వహుకులు సన్మానించి అభినందించారు.

రామగుండం నియోజకవర్గంలోని పలువురికి వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ సేవలందిస్తోంది. నిరుపేదలు, అనాథలు, వృద్ధులు, దివ్యాంగులకు ఆర్థికంగా చేయూతనందిస్తూ అండగా నిలుస్తోంది. ఉన్నత చదువులు చదివి ఉద్యోగరీత్యా విదేశాల్లో ఉంటున్న వ్యాళ్ల హరీష్‌రెడ్డి నిరుపేదలకు సేవ చేయాలన్న ధ్యేయంతో వీహెచ్‌ఆర్ ఫౌండేషన్‌ను స్థాపించారు. స్వంత ఊరిలో ప్రభుత్వ పాఠశాలకు తరగతి నిర్మాణంతో మొదలైన ఫౌండేషన్ సేవలు నియోజకవర్గ వ్యాప్తంగా విస్తరించాయి. జిల్లాలో ఎవరికి ఎలాంటి సహాయం కావాలన్నా వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ ద్వారా సేవలందిస్తామంటున్నారు సంస్థ నిర్వాహకులు.


మహిళలకు ఫౌండేషన్ ద్వారా కుట్టుమిషన్లు అందజేత

సామాజిక సేవలో వీహెచ్‌ఆర్

గ్రామం నుంచి నియోజకవర్గం దాకా విస్తరించిన సేవలు

నిరుపేదలకు అండగా నిలుస్తున్న ఫౌండేషన్


మారెడుపల్లి ప్రభుత్వ పాఠశాలలో రూ.4లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గది

వీహెచ్‌ఆర్ సేవల్ని రాష్ట్రమంతటా విస్తరిస్తాం..


వ్యాళ్ళ హరీష్‌రెడ్డి, వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు

సొంతూరికి సేవ చేయాలన్న సంకల్పంతో ఫౌం డేషన్‌ను ప్రారంభించాను. తరగతి గది నిర్మాణం మొదలుకొని గడిచిన ఐదేళ్లలో రామగుండం నియోజక వర్గంలోని నిరుపేదలకు ఎన్నో రకాల సేవలను అందించాను. మా సేవలను రాష్ట్రమంతటా విస్తరించి వీలైనంత మందికి స్వచ్ఛందంగా సేవలందించాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్నాను.

నిరుపేదలకు అండగా నిలుస్తాం..


సిగిరి రాము, వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ ఇన్‌చార్జి

గత ఐదేళ్లుగా రామగుండం నియోజకవర్గంలో నిరుపేదలకు ఫౌండేషన్ ద్వారా సేవలను అందిస్తున్నాం. ఫౌండర్ వ్యాళ్ల హరీష్‌రెడ్డి ఆదేశాల మేరకు నిరుపేదలు, మెడిసిన్ విద్యార్థి, విద్యార్థులు, అనారోగ్యం బాధపడుతున్న వారికి ఆర్థిక సహాయం అందిస్తున్నాం. వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ కార్యకర్తగా సామాజిక సేవ చేయడం సంతోషంగా ఉంది.

కోల్‌సిటీటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గంలో వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ సామాజిక సేవలో ముందుకు సాగుతున్నది. ఉమ్మడి రామగుండంలోని ప్రస్తుత పాలకుర్తి మండలం మారేడుపల్లి గ్రామానికి చెందిన వ్యాళ్ల రాంరెడ్డి-అనసూయల కొడుకు వ్యాళ్ళ హరీష్‌రెడ్డి (ఎన్ఆర్ఐ) వీహెచ్‌ఆర్ ఫౌండేషన్‌ను స్థాపించి నిస్సహాయులు, వృద్ధులు, దివ్యాంగులు, అనాథ పిల్లలకు, ఉన్నత విద్యకు అర్హులై ఆర్థికంగా చితికిపోయిన ఎంతో మంది విద్యార్థులకు అండగా నిలుస్తున్నారు. ఉన్నత చదువులు చదివి వీదేశాల్లో ఉంటున్న హరీష్‌రెడ్డి చిన్నతనంలో తనలో కలిగిన సేవా భావంతో వీహెచ్ ఆర్ సంస్థ ద్వారా స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్వగ్రామమైన మారేడుపల్లిలోని అరకొర తరగతి గదులతో కొనసాగుతున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రూ.4లక్షలతో తరగతి గది నిర్మించడంతో మొదలుపెట్టి నిరుపేద విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు, కుర్చీలు అందజేయడం, గ్రామ యువతకు లైబ్రరీని ఏర్పాటు లాంటి కార్యక్రమాలను చేపడుతున్నారు. సొంత ఊరికే కాకుండా రామగుండం నియోజకవర్గంలో వ్యాప్తంగా వీహెచ్‌ఆర్ సభ్యులతో సేవలు అందిస్తున్నారు. నిరుపేద మెడికల్ విద్యార్థి దర్విన్‌కు ప్రతి సంవత్సరం ఖర్చుల నిమిత్తం రూ.36 వేలు సంస్థ అందజేస్తున్నది. అలాగే మహిళలకు కుట్టుమిషన్లు అందజేయడంతో పాటు రోడ్డు ప్రమాదంలో మరణించిన స్థానిక తెలంగాణ ఉద్యమ కారుడి కుమారుడి చదువుల కోసం ఏటా రూ.30వేల ఆర్థిక సహాయం అందిస్తున్నది. అలాగే గోదావరిఖనిలోని గురుకుల పాఠశాలకు ఫ్యాన్లు, పాలకుర్తి, అంతర్గాం మండలాల్లో ప్రత్యేక లైబ్రరీలు ఏర్పాటు, క్యాన్సర్, ఇతర అనారోగ్యాలతో బాధపడుతున్న వారికి ఆర్థిక సహాయం అందిస్తున్నది.

భూ సేకరణకు రూ. 15 కోట్లు విడుదల
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు స్టేజ్ 2 ఫేజ్ 1లో భాగంగా మిగిలిపోయిన పనుల భూసేకరణ కోసం 15 కోట్ల రూపాయలు విడుదలైనట్లు వేములవాడ శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం నాడు ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేములవాడ నియోజకవర్గ పరిధిలోని శ్రీ పాద ఎల్లంపల్లి ప్రాజెక్టు స్టేజ్ 2 ఫేజ్ 1 లో భాగంగా మిగిలిపోయిన భూసేకరణ కోసం, బోరు బావుల నష్టపరిహారం కోసం 5 కోట్ల నిధులను ప్రభుత్వం సిరిసిల్ల జిల్లా కలెక్టర్ ఖాతాలో జమ చేసిందని తెలిపారు. కోనరావుపేట మండలం లచ్చపేట తండా రిజర్వాయర్ భూసేకరణ కోసం, వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి భూసేకరణ కోసం 5 కోట్ల నిధులు విడుదల అయ్యాయని వెల్లడించారు. కథలాపూర్, మేడిపల్లి, భీమారం మండలాల ప్రజల వరద ప్రదాయని అయిన కలికోట సూరమ్మ చెరువు కుడి ఎడమ కాలువ నిర్మాణం కోసం భూసేకరణ నిమిత్తం మరో 10 కోట్లు నిధులు జగిత్యాల జిల్లా కలెక్టర్ ఖాతాలో జమ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. కొన్ని రోజుల క్రితం తనతోపాటు సాగునీటిపారుదల శాఖ ఈఎన్ సి నేతృత్వంలో అధికారుల బృందం ప్రాజెక్టుల సందర్శన సందర్భంగా ప్రజలు, రైతులు నష్టపరిహార విషయమై పలుమార్లు విన్నవించారని, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జగిత్యాల కలెక్టర్ ఖాతాలో 10 కోట్ల రూపాయలు, సిరిసిల్ల కలెక్టర్ ఖాతాలో ఐదు కోట్ల రూపాయలు మొత్తం 15 కోట్ల రూపాయలను జమ చేసిందని తెలిపారు. గత ప్రభుత్వం మన ప్రాంతంలోని ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించడంతో రైతులు తీవ్ర అన్యాయానికి గురయ్యారని, వివిధ ప్రాజెక్టుల్లో భూములు కోల్పోయిన రైతులు, ప్రజలు నష్టపరిహారం చెల్లించాల్సిందిగా ఎన్నిసార్లు విన్నవించుకున్న నిధులు విడుదల కాలేదని, ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మన ప్రాంత ప్రాజెక్టులకు ప్రాధాన్యతనిస్తూ నిధులు కేటాయించడం హర్షనీయమన్నారు. 15 కోట్ల రూపాయలను విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆది శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

నేతన్నలకు ఉపాధి కల్పించాలి



సిరిసిల్లలో మాట్లాడుతున్న మూషం రమేష్

సిరిసిల్ల రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నేతన్నల ఆత్మహత్యలను నివారించాలని, ఉపాధి కల్పించి వర్కర్ టు ఓనర్ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృతలాల్ శుక్లా కార్మిక భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్లలో ఈ నెల 19, 20 తేదీల్లో సీపీఎం జిల్లా స్థాయి మూడో మహాసభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సభలకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్, రాష్ట్ర నాయకుడు కూరపాటి రమేష్ హాజరుకానున్నట్లు తెలిపారు. సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయం నుంచి బీవైనగర్‌లోని షాదీఖానా వరకు భారీ ర్యాలీ, బహిరంగ సభ ఉంటా యన్నారు. ఈ నెల 20న వేములవాడలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా సిరిసిల్ల నేతన్నలకు ఉపాధి కల్పించడంతో పాటు వర్కర్ టు ఓనర్ పథకాన్ని ప్రారంభించి మరమగ్గాల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు కోడం రమణ, సూరం పద్మ, పట్టణ కార్యదర్శి అన్నల్‌దాస్ గణేష్, రమేష్, చంద్ర పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి ఒకరి మృతి

తిమ్మాపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ మండలం గొల్లపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన రాకట్ల కిషన్(42) ఆదివారం ప్రమాదవశాత్తు గ్రామంలోని వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. ఎస్సై తాండ్ర వివేక్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కిషన్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ధర్మపురిలో భక్తుల సందడి


గోదావరి నది వద్ద హారతి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో ఆదివారం కార్తీక భక్తుల సందడి నెలకొంది. గోదావరి నదిలో భక్తులు కార్తీక స్నానాలు ఆచరించారు. నరసింహుడి ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేశ్ శర్మ, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు.

- వైభవంగా గోదావరి హారతి

కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి పదహారవ రోజు ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది గోదావరి వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య విశేష పూజలు చేసి నదీ మాతకు హారతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

- టీవీ సీరియల్ నటుడు పూజలు

లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని టీవీ సీరియల్ నటుడు మొగిలి రేకులు ఫేం సెల్వరాజ్ ఆదివారం సందర్శించారు. ఆలయం వద్ద ఆయనకు వేదపండితులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనకు ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు అందించి సత్కరించారు.


సెల్వరాజ్‌కు స్వామి శేష వస్త్రం బహూకరిస్తున్న ఆలయ ఉద్యోగి


కోటిలింగాల వద్ద గోదావరిలో స్నానాలు చేస్తున్న భక్తులు

కిటకిటలాడిన కోటిలింగాల

వెల్గటూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కోటిలింగాలలో ఆదివారం కార్తీక సందడి నెలకొన్నది. ఆదివారం సెలవు దినం కావడంతో గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి కోటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి భక్తులు కుటుంబంతో కలిసి రావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. పవిత్ర గోదావరి స్నానాలు ఆచరించిన భక్తులు పార్వతీ కోటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు నాగరాజుశర్మ, సంజీవ్‌శర్మలు భక్తులచే స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపించారు.

రాజన్న క్షేత్రంలో భక్తుల సందడి


రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రంలో భక్తుల సందడి నెలకొంది. కార్తీక మాసం సందర్భంగా ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి సుమారుగా 50 వేల మంది వరకు భక్తులు తరలివచ్చారు. ఆదివారం తెల్లవారు జామునుంచే భక్తులు ఆయా క్యూలైన్‌ల ద్వారా కళ్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్రస్నానాలను ఆచరించారు. అనంతరం పార్వతి పరమేశ్వరులను దర్శించుకున్నారు.

- సామూహిక కార్తీక దీపోత్సవం

వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో సామూహిక కార్తీక దీపోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయాధికారులు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మహిళలు దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కళాభవన్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


భక్తులతో కిక్కిరిసిపోయిన రాజన్న ఆలయం, ప్రాంగణం

మాల,మాదిగల మధ్య వైషమ్యాలు పెంచొద్దు

కొడిమ్యాల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మాల, మాదిగల మధ్య వైషమ్యాలను పెంచవద్దని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. జిల్లాలో ప్రారంభమైన మాల మహానాడు పాదయాత్ర ఆదివారం రాత్రి కొడిమ్యాలకు చేరుకుంది. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సుధాకర్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ తెలంగాణలో సోదర భావంతో ఉన్న మాల మాదిగల మధ్య వర్గీకరణ చిచ్చు పెట్టి పాలకులు వైషమ్యాలు సృష్టిస్తున్నారని సుధాకర్ అన్నారు. రాజ్యాంగ విరుద్ధమైన అశాస్త్రీయమైన ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అక్టోబరులో ప్రారంభమైన పాద నేటి వరకు 600 కిలోమీటర్ల వరకు కొనసాగిందన్నారు. కృష్ణమాదిగ వర్గీకరణ అంశాన్ని పక్కన పెట్టి రిజర్వేషన్ల పెంపు, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల కోసం కలిసి రావాలని కోరారు. ప్రధాని నరేంద్రమోదీ అంబేద్కర్ వాదాన్ని పాతిపెట్టి మను వాదాన్ని పెంచి పోషిస్తున్నారన్నారు. ఈ పాదయాత్రలో రాష్ట్ర నాయకులు మేడి అంజయ్య, ఆసాది పురుషోత్తం, వెన్న రాజు, జిల్లా నాయకులు కాడె శంకర్, పొనగంటి రాజన్న అల్ల వెంకన్న, మండల నాయకులు కాయిత రాజు, గుమ్మడి సత్యం, రావుల నర్సింగ రావు, బండి లక్ష్మీరాజం, చంద్రమొహన్ తదితరులు పాల్గొన్నారు.


మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్

మిడ్‌మానేరు నిర్వాసితులకు 4,696 ఇందిరమ్మ ఇళ్లు

కరీంనగర్ అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మన్వాడ గ్రామంలో నిర్మించిన మిడ్ మానేరు నిర్వాసితులకు 4,696 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయి. మానేరు నదిపై 2 లక్షల హెక్టార్లకు సాగు నీటిని అందించడం కోసం మిడ్‌మానేరు ప్రాజెక్టుకు 2005లో కాంగ్రెస్ ప్రభుత్వ శంకుస్థాపన చేసింది. నాటి ప్రభుత్వం సహాయంతో ప్రాజెక్టు పూర్తయినప్పటికీ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా నివాసాలు కోల్పోయిన 10,683 కుటుంబాలకు గతంలో 5,987 ఇండ్లు మంజూరు అయ్యాయి. మిగతా నిర్వాసితుల పక్షాన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు తదితరులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రత్యేకంగా కలిసి నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించిన ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మిడ్ మానేర్ నిర్వాసితులకు 4,696 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు కృతజ్ఞతలు వ్యక్తం చేసినట్లు డీసీసీ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది.

త్రుటిలో తప్పిన ప్రమాదం
- ఒక్కసారిగా బ్రేక్ వేసిన డ్రైవర్ - వ్యవసాయ బావి వద్ద నిలిచిన ప్రైవేటు బస్సు



వ్యవసాయ బావి గడ్డపై నిలిచిపోయిన ప్రైవేటు బస్సు

సిరిసిల్ల రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేట బైపాస్ జంక్షన్‌లో ఆదివారం త్రుటిలో ప్రమాదం తప్పింది. కామారెడ్డి నుంచి కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగే వివాహ వేడుకకు పెళ్లి బృందం ప్రైవేటు బస్సు చంద్రం పేట జంక్షన్ వైపు వస్తోంది. ముందున్న వాహనాలు ఒక్కసారిగా ఆగిపోవడంతో డ్రైవర్ గమనించి బ్రేక్ వేశాడు. పక్కనే ఉన్న వ్యవసాయ బావి గడ్డె పైకి వచ్చి నిలిచిపోవడంతో ముప్పు తప్పింది. అధికారులు జంక్షన్‌లో స్పీడ్ బ్రేకర్లు వేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

'మానేరు రివర్‌ఫ్రంట్‌కు జగపతిరావు పేరు పెట్టాలి'

కరీంనగర్ అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ శివారులో చేపట్టిన రివర్‌ఫ్రంట్‌కు కరీంనగర్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా పనిచేసిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు వెలిచాల జగపతిరావు పేరుపెట్టాలని వెలిచాల సాధన సమితి నాయకులు ఆదివారం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావుకు వినతి పత్రం అందజేశారు. జగపతిరావు విగ్రహం ఏర్పాటుకు 20గుంటల స్థలాన్ని కేటాయించాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి కన్వీనర్ సరిల్ల రతన్‌రాజు, కో కన్వీనర్ గండి రాజేశ్వర్, సభ్యులు నారాయణ, ఖషీద్, నరసింహారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

రామడుగు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రాపూర్ గ్రామంలో గామ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం 20 మంది నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చాడ ప్రసున చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ఆడెపు స్వప్న శ్రీనివాస్, చొప్పదండి డైరెక్టర్ జోగు పోలు, మండల కో-ఆర్డినేటర్లు ఆడెపు వినీల, ఆడెపు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మోక్షమెప్పుడో?

-దుర్శేడ్, గుంటూరుపల్లిలో ఏడాది క్రితం రూ.1.86 కోట్ల నిధులు మంజూరు -పనులు చేపట్టేందుకు ముందుకు రాని కాంట్రాక్టర్



గుంతలమయంగా దుర్శేడ్-గుంటూరుపల్లి రహదారి

కరీంనగర్ రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలోని గ్రామీణ రోడ్లకు మోక్షమెప్పుడు కలుగుతుందా అని పలువురు గ్రామస్థులు ఎదురు చూస్తున్నారు. గ్రామాల్లో రహదారులను సుందరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరం నిధులు మంజూరు చేసింది. కానీ గ్రామీణ రహదారుల నిర్మాణ పనులు చేపట్టడంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు విఫలం చెందారు. గత సంవత్సరం నిధులు మంజూరైనా పనులు ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో గ్రామస్థులు పనులు ప్రారంభం కాక ఇబ్బందులకు గురవుతున్నారు. కరీంనగర్ మండలం దుర్శేడ్ నుంచి గుంటూరుపల్లి గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణానికి సంవత్సరం కిందట బీఆర్ఎస్ ప్రభుత్వం హయంలో కోటి 86లక్షల 33వేల రూపాయలను మంజూరు చేసింది. టెండర్లు కూడా పూర్తయ్యాయి. కానీ టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు ప్రారంభానికి నోచుకోలేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు పూర్తిగా బురదమయం కావడంతో రైతులు ఇబ్బందులకు గురయ్యారు. దుర్శేడ్, గుంటూరుపల్లి గ్రామస్థులు ఇదే దారి నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. ఈదారి పూర్తిగా అధ్వాన్నంగా మారడంతో పడరాని పాట్లు పడుతున్నారు. వరి కోత సమయంలో రహదారి చెడిపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారి పనులను ప్రారంభించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అంగన్‌వాడీలకు మహర్దశ

(5వ పేజీ తరువాయి)

కేంద్రాల్లో 291 కేంద్రాలకు మాత్ర మే శాశ్వత భవనాలున్నాయి. మిగతావి అద్దె భవనాల్లో, ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్నాయి. మొదటి దశలో 36 అంగన్‌వాడీ కేంద్రాలకు 30 వేల రూపాయల నిధులు వెచ్చించి పనులు నిర్వహిస్తున్నారు. తొలి దశలో సొంత భవనాలు ఉన్న వాటిని ఎంపిక చేసి తరువాత అద్దె భవనాల్లో కొనసాగుతున్న వాటికి అన్ని హంగులతో కొత్త భవనాలు నిర్మిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో జాతీయ పాఠ్య ప్రణాళిక ప్రకారం సెలబస్ మార్చారు. ఈ సంవత్సరం నుంచి కేంద్రాల్లో జాతీయ పాఠ్య ప్రణాళిక ప్రకారం బోధిస్తారు.

- పిల్లలను ఆకర్షణీయమైన దుస్తులు

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులను ఆకర్షించేందుకు పలు రకాల డిజైన్లలో ఏకరూప దుస్తులను ప్రభుత్వం ఎంపిక చేసింది. బాలికలకు ఫ్రాక్, బాలురకు నిక్కర్, షర్టు ఇవ్వనున్నారు. మొదటి దశలో 13,048 మంది పిల్లలకు రెండు జతల యూనిఫామ్స్ కుట్టించారు.

మాలల సింహగర్జనను విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సుభాష్‌నగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని పెరేడ్ గ్రౌండ్‌లో డిసెంబరు 1న నిర్వహించనున్న మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని మాలల ఐక్యత అభివృద్ధి కమిటి సలహాదారుడు కొరివి వేణుగోపాల్, కన్వీనర్ ఈసరి జనార్దన్, కో కన్వీనర్లు అర్ష మల్లేశం, గంట శ్రీనివాస్, సరిళ్ళ ప్రసాద్, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కోచైర్మన్ నల్లల కనకరాజు పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో మాలల సింహగర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రప్రభుత్వం మొదలు పెట్టిన ఎస్సీ వర్గీకరణను వెంటనే నిలిపివేయాలని కోరారు. మాలలపై చేస్తున్న విషప్రచారాన్ని తిప్పి కొట్టాలన్నారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవడంలో మాలలంతా ముందుండి పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో మీడియా సలహాదారులు మేడి రాజవీరు, నక్క రాజయ్య, కుక్కల లక్ష్మీరాజం, మొగురం రమేశ్, కాడె శంకర్, వెన్నం రాజమల్లయ్య, కార్పోరేటర్ చంద్రమౌళి, దాసరి దశరథం, తాళ్ళ వెంకటేష్, రొడ్డ శ్రీనివాస్, మద్దాల రాజేందర్, ఉన్నంటి వెంకటస్వామి, ఎల్ దాసరి లింగయ్య, సిగిరి రవీందర్, గంటల రేణుక, మేకల రజనీ, శీలం పుష్పలత, జక్కుల లలిత, గంటల మహేందర్, కాడే రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న కుమార్‌వాడీ పాఠశాల పూర్వ విద్యార్థులు

కరీంనగర్ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కుమార్‌వాడీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1983-84 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్‌హాల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

ఆనాటి ఉపాధ్యాయులు పింగళి మల్లారెడ్డి, బుడిమె రఘు హాజరై ఆనాటి జ్ఞాపకాలను విద్యార్థులతో మననం చేసుకున్నారు. చిన్న నాడు ఆడిన ఆటలను గుర్తు చేసుకున్నారు. అప్పుడప్పుడు కలుసుకొని ఒకరికొకరం కలిసిమెలిసి ఉండాలని నిర్ణయించుకున్నారు.

బాలికలపై వివక్ష తగదు



వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో బాలికలపై వివక్ష తగదని, మానవ విలువలు మేల్కొనాలని వెస్లి కెథడ్రిల్ చర్చ్ ప్రెస్బెటేరియన్ పాస్టరేట్ చైర్మన్ పాల్ కొమాలు అన్నారు. ఆదివారం చర్చ్‌లో జరిగిన బాలికల సండే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్తు ప్రణాళికలను తల్లిదండ్రులు రూపొందించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి దేవదాస్, సహాయ పాస్టర్ మధుమోహన్, కోశాధికారి నెల్సన్, సండే స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చదరంగ పోటీలకు సుప్రీత్ ఎంపిక



సుప్రీత్‌కు స్వీట్ తినిపిస్తున్న జీనియస్ చదరంగ అకాడమి కోచ్ అనూప్ కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 68వ ఎస్‌జీఎఫ్ చదరంగ పోటీల్లో జీనియస్ చెస్ అకాడమీకి చెందిన కాశవేణ సుప్రీత్ ఎంపికైనట్లు జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనకయ్య తెలిపారు. ఈ సందర్భంగా సుప్రీత్‌ను, వారి తల్లిదండ్రులను జీనియస్ చెస్ అకాడమీ బాధ్యులు ఘనంగా సన్మానించారు. రేపటి నుంచి మధ్యప్రదేశ్‌లోని నర్మదాపురంలో జరిగే జాతీయస్థాయి చదరంగ పోటీల్లో తెలంగాణ టీంలో ఆయన ఆడనున్నారు. ఈ కార్యక్రమంలో జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ కంకటి అనూప్ కుమార్, కాశవేన మహేందర్, స్వరూప, కోచ్‌లు సుజన్ కుమార్, తరుణ్, అభిరామ్, రేవిక్, అరుణ్, నితిన్ శ్రీనిజ, తదితరులు పాల్గొన్నారు.

పేద ఆర్యవైశ్యులకు అండగా నిలవాలి

-ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ

కరీంనగర్ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పేద ఆర్యవైశ్యలకు అండగా నిలిచి వారికి అవసరమైన సహాయ సహకారాలను అందించాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ సంఘం ప్రతినిధులకు సూచించారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా కన్న కృష్ణ, ప్రధానకార్యదర్శిగా కొమురవెల్లి వెంకటేశం, కోశాధికారిగా పడకంటి శ్రీనివాస్‌తోపాటు జిల్లా కార్యవర్గం, మహిళా, యువజన, సేవాదళ్ కార్యవర్గంతోపాటుగా వివిధ అనుబంధ విభాగాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా అమరవాది లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వైశ్యుల సంక్షేమానికి, అభ్యున్నతికి పాటుపడాలని, సంఘ పటిష్ఠతకు సంఘంతోపాటు అనుబంధ సంఘాలు కృషిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు కన్న కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాచం సుష్మా, అడిషనల్ జనరల్ సెక్రటరీ స్వరాజ్య లక్ష్మి, మహాసభ రాష్ట్ర కార్యదర్శి ముక్త శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు కొండూరు సత్యనారాయణ, కటకం భూమయ్య, చంద రాజు, ఏవి మల్లికార్జున, గుండ చంద్రమౌళి, వేములవాడ ఆర్యవైశ్య సత్రం అధ్యక్షుడు బుస్స శ్రీనివాస్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు లింబాద్రి, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు బుస్స దశరథం, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు నలుమాచు ప్రభాకర్, యువజన అధ్యక్షుడు జిడిగె సాయికృష్ణ, మహిళా అధ్యక్షురాల చకిలం స్వప్న, సేవాదళ్ ఎలగందుల మునీందర్, వివాహ ప్రచార కమిటీ చైర్మన్ రాచమల్ల భద్రయ్య, సాంస్కృతిక విభాగం చైర్మన్ గోగుల ప్రసాద్, రాజకీయ కమిటీ చైర్మన్ శ్రీధర్, విద్యాకమిటీ చైర్మన్ మంచాల సుధాకర్, లీగల్ కమిటీ చైర్మన్ కొండూరు అజయ్‌చక్రవర్తి, పీఆర్‌వో బండ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'హృదయ విరులు' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న అతిథులు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఫిలింభవన్‌లో ఆదివారం మాంకాలి సుగుణ రచించిన 'హృదయ విరులు' కవితా సంపుటి ఆవిష్కరణ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర సాహిత్య అకాడమీ అడ్వైజరీ బోర్డు మెంబర్, తెరసం రాష్ట్ర అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం పుస్తకావిష్కరణ చేసి మాట్లాడుతూ సామాజిక అంశాలను పుస్తకంలో రచయిత్రి పొందుపరిచారని అన్నారు. ఈకార్యక్రమంలో సినీ గీత రచయిత, నటుడు, గాయకుడు సాదనాల వేంకటస్వామి, ముల్కనూరు మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్ హర్జిత్‌కౌర్, తెలుగు భాషా సంరక్షణ సంఘం ప్రధాన కార్యదర్శి బొమ్మకంటి కిషన్, నీలగిరి అనిత, వేదిక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్, పబ్బ జ్యోతిలక్ష్మి, దామరకుంట శంకరయ్య, డాక్టర్ బీవీఎన్ స్వామి, ముదుగంటి సుధాకరరెడ్డి, పెండోట వేంకటేశ్వర్లు, ఏదునూరి వేంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



బహుమతుల ప్రదానోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యనారాయణ

శంకరపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసంతో పాటు స్నేహభావం, ఐక్యత పెంపొందుతుందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శంకరపట్నం మండలం తాడికల్ గ్రామంలోని క్రీడా మైదానంలో చింతగుట్ట గ్రామానికి చెందిన కరివేద సదాశివరెడ్డి స్మారకార్థం సదాశివరెడ్డి తనయుడు ఆదర్శ ఆస్పత్రి సీఈవో కరివేద సత్యనారాయణరెడ్డి నిర్వహించిన క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ విజేతగా నిలిచిన మొగిలిపాలెం జట్టుకు, రన్నరప్‌గా జట్టుకు బహుమతులు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత క్రీడలపై దృష్టి సారించాలని చెప్పారు. ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య, కొత్తగట్టు శ్రీమత్స్యగిరీంద్రస్వామి ఆలయ చైర్మన్ ఉప్పుగళ్ల మల్లారెడ్డి, హుజూరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర సర్వే

రామడుగు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో సమగ్ర సర్వే కొనసాగుతోంది. ఆయా గ్రామాల్లో ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహిస్తున్నారు. గోపాల్‌రావుపేటలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న ఇంటికి వెళ్లి ఎన్యూమరేటర్ వివరాలను సేకరించారు.

పీఏసీఎస్ చైర్మన్ జన్మదిన వేడుకలు

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మనపల్లి గ్రామ పీఏసీఎస్ చైర్మన్ కౌరు సుగుణాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం సింగాపూర్ గ్రామం లోని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వొడితల ప్రణవ్ నివాసగృహంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుగుణాకర్‌రెడ్డి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొల్లూరి కిరణ్‌కుమార్, సందమల్ల బాబు, యాళ్ల రాజేశ్వర్‌రెడ్డి, మిడిదొడ్డి రాజు, వాసాల శ్రీనివాస్, గంటా కిరణ్‌రెడ్డి, ప్రశాంత్ తదితరులుఉన్నారు.

కమిటీలో నాయీబ్రాహ్మణులను నియమించాలి

గన్నేరువరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో పాలకమండలి కమిటీ సభ్యులుగా నాయీబ్రాహ్మణులను నియమించాలని సంఘం మండల అధ్యక్షుడు గర్శకుర్తి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయాలకు నాయీబ్రాహ్మణులకు వృత్తిపరంగా ప్రత్యేకమైన సంబంధం ఉందన్నారు. రాష్ట్రంలో నాయీబ్రాహ్మణులు సేవ చేయని ఆలయం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నాయీబ్రాహ్మణుల సేవలను గుర్తించి ఆలయాల పాలమండలి కమిటీలో సభ్యులుగా చేర్చేందుకు జీవోను జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆదమరిస్తే అంతే..

● రోడ్డు పక్కన ప్రమాదకరంగా బావులు ● రక్షణ గోడలు లేని వైనం ● వాహనదారుల అవస్థలు



రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయ బావి



పీచుపల్లి వద్ద బావిలో పడిన కారు(ఫైల్)

గన్నేరువరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న బావులు ప్రమాదకరంగా మారాయి. గునుకుల కొండాపూర్ వద్ద ప్రధాన రహదారి పక్కనే వ్యవసాయబావి ఉంది. ఈ బావి రోడ్డుకు అనుకొని ఉండడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు జంకుతున్నారు. గన్నేరువరం నుంచి గుండ్లపల్లి వెళ్లే ఈ రహదారిపై నుంచి రోజు పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. బావి చుట్టూ ఎలాంటి రక్షణ చర్యలను చేపట్టక పోవడంతో ప్రమాదకరంగా మారింది. డబుల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా వ్యవసాయ బావిని ఆనుకొని పనులు చేపట్టారు. రోడ్డు కాస్త గతంలో నిర్మించిన బావికి సమాంతరంగా వచ్చింది. దానికి రక్షణ గోడ సైతం నిర్మించేందుకు అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలోనే ప్రభుత్వం రోడ్డు పక్కన ఉన్న బావులన్నీ పూడ్చివేయాలని ఆదేశించింది. రోడ్డు పక్కన ఉన్న బావుల్లో గతంలో కొన్నిచోట్ల కార్లు, ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు పడిన ఘటనలు చోటు చేసుకున్నాయి. దీంతో రోడ్డు పక్కన ఉన్న బావులు, నిరుపయోగంగా మారిన వాటిని సైతం పూడ్చివేయాలని ప్రభుత్వం సూచించింది. కానీ అధికారులు రోడ్డు వేసే సమయం లోనూ దీన్ని పట్టించుకోలేదు. ఈ రోడ్డు మీదుగా కొత్త వారు వాహనం నడుపుతూ వస్తే బావి ఉన్న విషయం తెలియక ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. రాత్రి వేళల్లో రాకపోకలు సాగించే వాహనదారులు ఏమాత్రం నిర్లక్ష్యంతో వెళ్లినా బావిలోకి దూసుకెళ్లే పరిస్థితి నెలకొంది. కొద్ది రోజుల క్రితం గునుకుల కొండాపూర్ నుంచి పీచుపల్లికి వెళ్లే దారిలో ఓ కారు రోడ్డు పక్కన ఉన్న బావిలో అదుపు తప్పి పడిన ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ప్రమాదం చోటు చేసుకున్నా ఆ వ్యవసాయ బావికి ఇప్పటివరకు రక్షణ ఏర్పాటు చేయలేదు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

నేడు భాగవత సప్తాహం

భగత్‌నగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి పట్టణంలోని సచ్చిదానందశ్రమంలో సోమవారం భాగవత సప్తాహం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ వెంకటేశ్వర, హనుమాన్ ట్రస్ట్ కమిటీ ఆధ్వర్యంలో త్రిదండి అహోబిల జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో కార్యక్రమం ఉంటుందన్నారు. సోమవారం ఉదయం 8.30 భగవద్గీత పారాయణం, 9 గంటల నుంచి 12గంటల వరకు భాగవత సప్తాహ ప్రవచనము, తదియరాధన, సాయంత్రం 4 గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం, సాయంత్రం 4.30 నుండి 6 గంటల వరకు శ్రీ వెంకటాచల మహాత్యం, 24వ తేదీ ఉదయం భాగవత సప్తాహ ప్రవచనము, అనంతరం రుక్మిణి కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కెప్టెన్ లక్ష్మీకాంతారావు జన్మదిన వేడుకలు

గణేశ్‌నగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మాజీ రాజ్యసభ సభ్యులు కెప్టెన్ లక్ష్మీకాంతారావు జన్మదిన వేడుకలను ఆదివారం తెలంగాణ చౌక్‌లో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జీవీ రామకృష్ణారావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ హాజరయ్యారు. జిల్లా అధికార ప్రతినిధి అమరావతి సలీం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు అభిమానులు రక్తదానం చేశారు.

సర్వే సిబ్బందికి పారితోషికం ప్రకటించాలి

జగిత్యాల అర్బన్, నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వే చేస్తున్న సిబ్బందికి పారితోషికం ప్రకటించాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు మచ్చ శంకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బైరం హరికిరణ్, రవీంధర్, బండి శ్రీనివాస్, మేకల ప్రవీణ్, నరేష్, మురళి పాల్గొన్నారు.

నియామక పత్రాల అందజేత

సిరిసిల్ల రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పద్మశాలిసంఘం రాష్ట్ర కమిటీ సభ్యులకు ఆదివారం నియమాక పత్రాలను రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్ కుమార్ అందజేశారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర పద్మశాలి సంఘం సమావేశంలో సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన శ్రీధాగ మైసయ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, సహాయ కార్యదర్శులుగా మహేష్, గొనె ఎల్లప్పను నియమించారు.

చొప్పదండిలో వైద్య శిబిరం

చొప్పదండి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చొప్పదండిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో కరీంనగర్‌కు చెందిన ఒక ప్రైవేటు ఆసుపత్రి నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గుర్రం నీరజ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నిజనాపురం చందు, మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్వారు మహేష్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్ రెడ్డి, నాయకులు పురం రాజేశం, పెరుమండ గంగయ్యగౌడ్, కొట్టె అశోక్, ముద్దం తిరుపతి, గుర్రం రాజేందర్ రెడ్డి , గుర్రం రమేష్, కడారి శంకర్, విద్యాసాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్ర కమ్యూనిటీ హాల్ ప్రారంభం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగంలోని సప్తగిరి కాలని గంగా పరమేశ్వరాలయంలో ఆదివారం బెస్త (గంగపుత్ర) కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం జరిగింది. కార్యక్రమంలో కార్పొరేటర్లు పెద్దపల్లి జితేందర్, దిండిగాల మహేశ్, నాగుల కనకయ్య, గడప సత్యనారాయణ, గడప కోటేశ్‌కుమార్, పెద్దపల్లి రవీందర్, గడప లక్ష్మీనారాయణ, పెద్దపల్లి సత్యనారాయణ, నరసయ్య, నరహరి పాల్గొన్నారు.

సిరిసేడులో వారసంత ప్రారంభం



వారసంతను ప్రారంభిస్తున్న గ్రామస్థులు

ఇల్లందకుంట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలోని సిరిసేడు గ్రామంలో ఆదివారం వారసంతను గ్రామస్థులు ప్రారంభించారు. ఎలాంటి డబ్బులు చెల్లించకుండా వ్యాపారులు వారసంతలో సామగ్రి విక్రయాలు చేసుకోవచ్చని గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తీర్మానం చేశారు. ప్రతి ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు సిరిసేడులో వారసంత జరుగుతుందని గ్రామస్థులు తెలిపారు. కార్యక్రమంలో కొక్కుల దేవేందర్, మాజీ సర్పంచ్ రేణికుంట్ల లచ్చయ్య, మాజీ ఎంపీటీసీ నేరేళ్ల కుమార స్వామి, జేకే, ముస్తఫా, రామకృష్ణ, విజయ్, చిరంజీవి, సారంగం, జయమూర్తి, మహిపాల్, శివ, సతీష్, రమేశ్, నరేందర్, సంజీవ్, సత్యం, హనుమంత్, రాజవీరు, రవి తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోతున్న చెత్తాచెదారం

- మూడు నెలలుగా పని చేయని వాటర్ ప్లాంట్

రామడుగు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌రావుపేట మేజర్ గ్రామపంచాయతీలో చెత్తాచెదారం పేరుకుపోతోంది. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. ప్రత్యేకాధికారులు అప్పుడప్పుడు మాత్రమే పర్యవేక్షించడంతో పారిశుధ్యం పట్టింపు లేకుండా పోయింది. ఓ వైపు పారిశుధ్య లోపం, మరోవైపు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ మూలకు పడి నెలలు గడుస్తున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. దీంతో తాగునీరు ప్రైవేట్ ప్లాంట్ల వద్ద కొనుగోలు చేస్తున్నారు. ఎక్కడ చెత్త అక్కడే ఉండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిన అనంతరం ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.